ఏది ప్రేమ?

ఊటుకూరు సత్యనారాయణరావు బహద్దరుగారు, జమీందారు

౧

"మీకేంతెలుసే? పనికటాల్లు. మీకు ప్రేమంటే పకటి తెలుసా?"

ముసలమ్మ సణుక్కుంది.

"ఏంతెలియందే యింతకాలము గడిచిందా? ఈనాటికి మీరు కలిగి సంఘము, ఆచారాలు మంట్లో గలుపుతున్నారు."

"కాలం గడవటానికేంలే? అది అనంతమైంది. అవి మీకోసం గడవలేదు. దాని స్వభావమది. అంతమాత్రం చేత—అయితే మీకాలోజుల్లో చదువు......"అని చిరునవ్వుతో యేమో చెప్ప బోతుంది మాధురి.

"ఆ! ఈచదువు లొచ్చే ముఖ్యంగా యింతచేసినై. ఊరక వుండి యేమిచేస్తావని మీనాన్న స్కూలులో వేశాడు. అంతకుముమ నీ వితండవాదా లెక్కడివి? చదువేపోకాని నీయీడుకు నీవు ప్రేమ, గేమ అంటూ అప్పుడే మొదలెట్టావు. నామటుకు నేను మీ నాన్న పుట్టేవఱకు మీతాతయ్యను కన్నెత్తిమాడలేదు. పలకరించ లేదు."

"తాతయ్యా? ఆయన.....చేలు...ఎడ్లు..............."
మాధురి కిలికిలి నవ్వటం మొదలెట్టింది. కొంచెం సవరించుకొని ఏమో చెప్పబోయి మళ్లీ నవ్వింది.

ముసలమ్మకు కోపం పైబడివచ్చింది. అయితే చిన్నతనంనుంచి పెంచిన ప్రేమవల్ల అప్రసంగా లేమీ లెక్కచేయలేదు. మాధురికి పదిహేనేండ్లు దాటినై. తెనుగులో చాలాపరిచయం సంపాదించింది. ఇంగ్లీషుకూడ తెలుసు. ఆమె మాట్లాడుతూంటే యెంతో విమర్శనా దృష్టి కనుబడుతుంది. న్యాయంముందు సంఘాన్ని, ఆచారాల్ని గమనించదు. ఎప్పుడూ నూతనాభిప్రాయాలు, నూతనమైన మార్గాలు, పశ్చాత్యేమపిపాస ఆమెను ఆవరించివుంటయి. ఉదయం యేడుగంటలు కొట్టారు. కాఫీ తీసుకుంటేనేకాని సుదర్శనంస్కూలుకు పోడు. ఆత నిప్పుడు ఇంటర్మీడియేట్ చదువుతున్నాడు. ప్రపంచవ్యవహారాల గొడవ వచ్చిందంటే అవ్వాళ స్కూలుకు శెలవే. ఎదుటివాడు వోపికస్థుడైతే యెంతకాలపు శెలవులుకూడ అప్పుడే వస్తయి. శ్యామల్ను కమ్మని ఉదయానవే కబురంపాడు. అతడు వస్తాడనే నిరీక్షణలో ఈరోజు కాఫీకి పొద్దెక్కింది.

"అన్నాయి! కాఫీ తేనా?"

మధురంగా లోపల్నించి వినపడ్డది. ఆమె మాధురి.

"కొంచెముండు; శ్యామల్ వస్తాడు. అంతా పక్కసారే"అన్నాడు సుదర్శనం.

శ్యామల్ క్రొత్తగా డాక్టరీపాక్టీసు ప్రారంభించాడు. కొంచెం కలిగినవాడు. వివేకంకూడా వుంది. కేవలం ప్రజోపయోగమే ఉద్దేశించి ఈపని చేస్తున్నాడు. ఇచ్చినా, యివ్వకపోయినా బాధలేదు. వీళ్లందరిది ఒకటేవూరు. సుదర్శనమంటే శ్యామల్కు చాలా అభిమానం. ఐతే సుదర్శనం సంస్కర్త. అప్పుడప్పుడు వివాదపడే అభ్యాసం వారికుంది. దాని పర్యవసాన మెట్లా మారినా వారి మిత్రత్వానికిమాత్ర మేంబాధ లేదు.

"డియర్ సుదర్శనం!"

"అదుగో వచ్చాడు. నీకేం అభ్యంతరం? రావచ్చు" అన్నాడు ఆతురతతో సుదర్శనం.

ఒకగదిలో గుండ్రటిబల్ల పకటి వేసుంది. దానిచుట్టూ దంతపు పనిచేసిన కుర్చీలు. సిల్కుకర్టెన్ పకటి ద్వారమునకు పక్కగా వ్రేలాడబడి వుంది. శ్యామల్ వచ్చాడు లోపలికి.

శ్యా—ఇవ్వాళ శెలవే ననుకుంటా

సు—చదువుల్లోకన్నా మిత్రుల్ను కలుసుకోటంలో చాలా వుపయోగం కనపడేనాడు శెలవలె అమూల్యంగా ఉన్నయి.

శ్యా—ఏం కబుర్లు?

'మాట్లాడుదాం' అన్నాడు సుదర్శనం.

మాధురి ఫలహారాలుతెచ్చి బల్లమీద పెట్టింది. కప్పుల్లో కాఫీ ఆరుతోంది.

"మధూ! నువుకూడా కూచో" సుదర్శనం అన్నాడు. అంతా కలిసి ఫలహారాలుచేసి కాఫీ తీసుకుంటున్నారు. డాక్టరుకు సుదర్శ

వంలో కలిసిన యీమార్పు, సంస్కరణాభిలాష చాలా ఆనందం గొలిపినై. సుదర్శనంకోసం వచ్చినప్పుడొకసారి శ్యామల్ మాధురిని చూశాడు. కాని మాట్లాడలేదు. ఆమె చాలా చదువుకుందని, ముద్దుగా గీతాలల్లుతుందని విన్నాడు. కాని అవకాశమే చిక్కలేదు ప్రపంచానికి. లక్ష్మీవిలాసములైన ఆకండ్లు ఏ అవ్యక్తప్రపంచయాత్రో చేస్తున్నట్లు కనబడుతై. ఆముంగురులకు మొహంమీద వ్రాలుతూవుండటమే ఒకఆట. కాఫీ రుచ్యంగానే వుంది. కాని ఎఱ్ఱగా పలుచగా వున్న ఆమె పెదవులకు వేడిగా తగులుతూవుంటె శ్యామల్ హృదయం కొట్టుకుంది. చైనాసిల్కు రవికలోనుండి దీర్ఘములైన ఆమె బాహువుల సౌష్టవం, మెరుపు, ఒక్కటూ, ఆమెశరీర మంతా గులాబితోటల్లే వుంది. కప్పు క్రింద పెట్టింది. గాజులు చేతుల్లో పడ్డై. ఇకేమాస్తూవుంటె సుదర్శన మేమన్నా అనుకొంటా డేమోనని బలంగా దృష్టి సుదర్శనంపైకి తిప్పాడు.

సు—శ్యామల్! ఏమని నిన్న సనాతనధర్మసభవారు తీర్మానించారు?

"విధవావివాహాలు నిషేధాలు. అట్లా చేసుకున్నవాళ్లెల్లా సంఘంలోంచి బహిష్కరించా"లని.

"ఇంతేనా?"

"ఇంకా చాలా వున్నై. ముఖ్యవిషయంమాత్ర మిదే."

మాధురి పెదిమలపై మందహాసం తొలుకాడింది. కాని కళ్లల్లో కెంపుజీరలు లేలినై.

"మేంగూడా విన్నొచ్చా!" అన్నది మాధురి.

శ్యామల్ నవ్వుకండ్లతో "తప్పకుండా" అన్నాడు.

"నీ అభిప్రాయమేమిటి శ్యామల్?"

"నాఅభిప్రాయమే అడుగుతే వాండ్లంతా మనుష్యులు కారంటా. కనక నీకభ్యంతరముంటే చెప్పు. బాగుంటుంది."

"తొందరపడకు. వాండ్ల తీర్మానానికి గూడా అర్థం వుంటుంది. స్త్రీలోకాన్ని పవిత్రవంతం చేయాలని ఈవిధంగా చేసియుంటారు."

"బలవంతంగానా?" అన్నది మాధురి ఈర్ష్యతో. శ్యామల్ మాధురివేపు తిరిగి "లేదు, వారిస్వాతంత్ర్యం అట్లా వుపయోగించుకున్నారు." అన్నాడు.

సు—భర్త గతింపగా నిరాలంబమైన జీవనం, తమ యోగ్యత, శక్తివల్లనే గడుపుకొనుట వారిజాతి గర్వింపవలసిన విషయం కాదా?

మాధు—అట్లా అనటానికన్నా పురుషులు తమ వుపయోగం కోసం ఇంత మహాకార్యం చేస్తున్నా రంటే వివాదపోతుందేం?

"అది మాకవమానం కాదు?" శ్యామల్ మెల్లగా అన్నాడు.

మాధు—అవమానంరాకుండా అపకారం చేతామనా? అది చాలా దుస్సాధ్యమైన పని.

శ్యామల్—ఈ ఆచారం ఎప్పుడో భిక్షుణ్ణీ అంబ వేధింపకు తిన్నరోజుల్లో బహుశా పుట్టివుంటుంది. సంఘంలోనుంచి బహిష్కారం కూడానా? దేశకాలముల ననుసరించి నీతిస్వాతంత్ర్యాలు సరించకుండేకొఱకు ఒకసంఘమని, నియమమని పెట్టారు. కాని జాతిపురోవృద్ధి, స్వేచ్ఛ, ఆనందాలు వేరుతో పెకల్చి శాశ్వతఘోరదుఃఖాగ్నిలో త్రేల్చటానికి గాదు. ఇట్లాచేయటానికి ప్రత్యేకవ్యక్తులకును రాగి శేకులపైన ఎవ్వరు చెక్కించి యివ్వలేదు.

మాధురి ప్రతిరక్తనాళంలోనుంచి స్వేచ్ఛానందాలు పొంగులెత్తినై. "సనాతనధర్మప్రచారం చాలా తగ్గింది మనదేశంలో. కాని వాండ్లల్లో పట్టుదలమాత్రం తగ్గలేదు. వయస్సుతోగూడా పెరుగుతూంది వాండ్లకు. మధూ! మీ అభిప్రాయాల్లో మీకు విశ్వాస ముండవచ్చు. కానివారి నెట్లు తప్పంటావు?" అన్నాడుఆలోచనతో సుదర్శనం.

శ్యామల్—ఎందుకనగూడదు? వారికి విశ్వాస ముండవచ్చు. ఒకవిషయాన్ని న్యాయానికి వదుత్తే సాధారణంగా అందరికి వొకరీతి తోస్తుంది.

సు—స్త్రీల వ్యక్తిస్వాతంత్ర్యం అరికట్టడం పాపమనే తోస్తుంది నాకూను. ఆబాధ్యత వారికే వదుత్తె బాగుండేది. ఇట్లా బహిష్కారరూపమైన శాసనంచేయడంమాత్రం వారి నిరంకుశత్వం, అనాగరికత వెల్లడిస్తుంది.

'మధూ!' అని ముసలమ్మ పిలిచింది.

మాధు—చదువుకోటానికూడా ఒకనిషేధం వుండేది వెనక. ఇప్పటికి చాలావఱకు అమలులో పెట్టుకూనే వున్నారు కొంతమంది పెద్దకుటుంబాలవారు.

సుదర్శనం ఆమాటకు సమ్మతించలేదు. "అది నే నెప్పుడు ఒప్పుకోను" అన్నాడు.

"చదువుకున్న భార్యరావాల్నని నీకోరిక లే! అందుకోసం నువొప్పుకోవు" అన్నాడు శ్యామల్.

'మధూ!' మళ్లీ పిలుపు.

'ఇదేం గొడవా'అంటూ లేచిపోయింది. కుచ్చిళ్లు కాళ్లలో తొక్కింది. శ్యామల్, సుదర్శనం ఏదో మాట్లాడు కున్నారు. 'ఆఫీసుకు వేళైంది. మళ్లీ సావకాశంగా మాట్లాడుకుందాం. సాయంత్రము పార్కుదగ్గర కలు'అనిచెప్పి శ్యామల్ వెళ్లాడు ఆలోచనతో.

౨

శ్యామల్ వక్తృత్వం, రూపం చూశిందగ్గరనుంచి మాధురికి అతనిపై ఒకవిధమైన ప్రేమ, అభిమానం మొలకెత్తి పెరుగుతున్నాయి.

వివాహంయొక్క అర్థం తెలియంది మాధురి పెండ్లిచేసుకోటం పాప మనుకుంది. పెండ్లి అనే పేరుతో లోకంలో చాలా హత్యలు జరుగుతున్నై. వివేకంలేకుండా పెరిగిన పెద్దవాండ్ల చేతుల్లో తరతరాల్నుంచి ఈ మహాయుగమే వివాహవిధిని శాసిస్తోంది. అభిప్రాయం మంచిదైనా ఆచరణలోని కొచ్చేవరకు చాలా వికృతరూపం దాలుస్తోంది. దైన్యమైపోయిన మనజాతిని చూచి ఒక్క అశ్రువైనా విడిచే సంస్కర్త లేడు. పిపీలికాది బ్రహ్మపర్యంతంగల సర్వభూతాల్లో మహావిద్యుత్ప్రవాహంలాగు అనుక్షణం కదుల్తూన్న ప్రేమయొక్క సూత్రంగా వివాహం నిశ్చయింపబడ్డది. అది రానురాను సంకుచితమై అవసరంకొరకు స్వార్థపరంగా ఉపయోగించుకు నేరీతిగా దిగింది. ఈ అభిప్రాయం మాధురిమస్తిష్కంలో కదిలేవరకు 'మానవప్రపంచమెంత కృత్రిమమైపోయింది. ప్రేమలేని యీలోకం పాడుపడ్డది' అని ఒక్క నిశ్వాసం విడిచింది. ఇంతలో ఏదో చప్పుడైంది. క్రింద ఏవో ఏరి తింటూన్న చిన్నపక్షి ఒకటి చెట్టుమీద కెగిరింది. వదులుగా ముడి వేసుకున్న జుట్టు పక్షికాలుతగిలి చంపమీద పడ్డది.

'మీ జీవితమే ధన్యమైంది' దాన్ని చూస్తూ అన్నది. విశ్వవ్యాపకమైన ప్రేమ అప్పుడామె కళ్లల్లో నిండివుంది. శ్యామల్ కు మాధురితో పరిచయం, చనువు ఎక్కువైంది. ఇంచుమించుగా యిరువురి అభిప్రాయాలు ఒక్కటేనని చెప్పాలి. అవకాశం కలిగినప్పుడెల్లా ఒకరినొకరు కలవడం, ఏదోగోష్టిలో ప్రొద్దులు పుచ్చడం మామూలయింది. ఆవూళ్లో వున్నమిత్రు లందరిలో శ్యామలే చాలా వివేకం, ఉత్సాహం గలవాడని మాధురినమ్మకం. తరుచు శ్యామల్ ను సందర్శించడం మాధురికి చాలా యిష్టం. ఇలా వివాహంలేకండా చనువుల్లో తేల్తూవుంటే ఆవూళ్లో అందరికీ బాధగానేవుంది. లోకం వెర్రిది. పాపం! వాండ్ల క్రూరమైన విమర్శనలకు గురికాకుండా తప్పలేదు. మేరువువంటి స్థైర్యంతో తన్ను ద్వేషించేవార్ని గూడా ప్రేమిస్తూ, జీవితమంతా సౌందర్యానందాల నిలయంగా చేసుకుంటూన్నది మాధురి. స్వార్థపరమై, కామోన్మత్తమై, దురాశాద్వేషయుతమై యున్న లోకదృష్టి ప్రేమస్వరూపాన్ని ఎట్లా చూస్తుంది? నిరాడంబరమును, ప్రేమపూరితమును నైన హృదయాన్ని చూడాలంటే ఈదృష్టి చాలదు. దివ్యదృష్టి కావాలి.

శ్యామల్ కొన్ని క్రీపరు తీగలుతెచ్చి వెనగ్గా నిల్చొని మాధురి జుట్లో చుట్టాడు. ఆమెయేదో ఆలోచిస్తోంది.

శ్యామల్ తెలియనట్టే ముందుకు వచ్చాడు. "నీ ఆలోచన నాకు తెలుసు. తీగలుచుట్టుకున్న ఆజుట్లో పువ్వు పెట్టుకుందామని కదూ! నేచెప్పనా?"

మాధురి ఆశ్చర్యంతో మందహాసంచేస్తూ ముడిపెడువుకుంది.

మా—ఇట్లా చెయ్యడం తప్పుకాదు?

శ్యా—పూలేమి తురమకండా వదిలెయ్యడమా?

మా—కోమలంగా పెరిగి అల్లుకుంటూన్న తీగ తెంపి చుట్టితే దానిశోభ తగ్గదే?

శ్యా—లేదు. ఎక్కువైంది. అంతకుముందు దాని అందం సహజంగానే వుంది. ఇప్పుడో మేఘాల్లోంచి లతలు ప్రాకులాడుతూన్నట్టుంది. ఇది విచిత్రమైన ఒక అపూర్వసృష్టి. నీముడి మేఘశకలంలా వుంది. ప్రేమతో వర్షించి పెంచుకున్న లతాసౌకుమార్యం చూసి మేఘము ముద్దెట్టుకుంటున్నట్టుంది.

మా—డాక్టరుకు రసవివేకంగూడానా?

శ్యా—మీకవిత్వంలో ఊహించి రసాన్ని చిత్రిస్తారు.

డాక్టరు కొత్తమార్గం కనిపెడదామని కోపిమాస్తున్నాడు.

మాధురి నవ్వు ఆపలేకపోయింది. పెదిమలు దాటిపోయింది నవ్వు. ఆమె సున్నితిచంపలు కొంచెం కదులాడినై.

"ఓరి పిండ్లబండతనం, ఊహించలేకపోతే కోసి పాడుచేస్తారా? పిండ్ల కొత్తమార్గం ఎవరన్న నేర్చుకుంటారేమో? శ్యామల్! నువ్వీ వృత్తి మాను. నాకేం బావుళ్లేదు.

"నువ్వు చెప్పింతరువాతనా యింకా. మధూ! నువు నన్ను ప్రేమిస్తున్నావా?"

"నీకు తెలీటం లేదు?"

"నువు చెప్పు"

"నేనెందుకు చెప్పాలి?

శ్యామల్ దీనంగా కూరుకున్నాడు.

"నీవు నన్ను గాఢంగా ప్రేమిస్తే నేను నిన్ను ప్రేమించినట్టు కాదూ శ్యామల్!".

"ఎట్లా, నీ కావుద్దేశమే లేకపోతే?"

"లేకపోతే నాదురదృష్టం. నీకేం లోపం?"

ఈమాటతో శ్యామల్ పూర్తిగా క్రుంగిపోయినాడు. నిరాశ, నిస్పృహ అంతా ఆవరించినై. దీర్ఘ నిశ్వాసం ఒకటివిడిచి లేచాడు.

"శ్యామల్! వెళతావా యేం?" అన్నది మాధురి.

"ఇవ్వాళ చాలా అస్వస్థతగా వుంది యెందావలనో. వెళతా"

మాధురి ఎదురుగావచ్చి రెండుచేతులు భుజంమీద వేసి నిలుచుంది. శ్యామల్ కండ్లల్లో చూస్తోంది.

"కోపం వచ్చిందా?"

"లేదు"

"అప్పుడే యేం పోకపోతే"

"సుదర్శన మేమన్నా అనుకుంటాడు మనం ఇట్లావుంటే"

చేతులు తీసింది.

"రేపు వస్తా చదువుకుందాం" అమితమైన ఉత్సాహంతో, ప్రేమతో అన్నది మాధురి.

శ్యామల్ ధైర్యం తెచ్చుకున్నాడు. ఎంతో నిగూఢమై అగాధంగావున్న ఆమె ప్రేమ అర్థమే కావటంలేదు. రెండునిమిషా లాలోచిస్తూ నిలుచున్నాడు."

"నువు రాకూడదు?

"సరే" అన్నది.

3

పార్కులోకి సాయంత్రము చాలామంది వచ్చారు. ఏవో ఆటలు, ప్రసంగాలు; పార్కంతా కోలాహలంగా వుంది. జలయంత్రంచుట్టు కొంతమంది పల్లెవాండ్లు మూగి ఆవిచిత్రం చూస్తూ పోతూన్నారు. ఎవరో వ్రాసుకుంటున్నాడు కుర్రాడు ఒడ్డుమీద. నీటి కుండలో తిరిగే బాతోటి రెక్కలార్చింది. కాయితాలు తడిసినై. లేచిపోయినాడు. పారసీకపు స్త్రీ అల్లే వుంది ఒక ఆవిడ. మీసాలు కొరుక్కోపోయిన బట్టతల క్రాపింగు జెంటిల్ మెన్ చెవులో ఏమో చెపుతూ లైబ్రరీ కేసి పోతున్నాడు.

ఈగోడ వేమీపట్టలేదు సుదర్శనానికి. ఏదో ఆలోచిస్తూ పచ్చిక మీద కూచున్నాడు. ఎత్తులపై ఎత్తులు వేస్తున్నాడు శ్యామల్.

"నీమాటలు నాకేం అర్థంకావడంలేదు. ఒక ప్రియురాలుంటుంది. ఆమెను గాఢంగా ప్రేమిస్తాము. మనోవాక్కాయాలతో ప్రేమిస్తాము. ఈవృష్టి ఒకప్పుడు మారిపోతే ఏమంటారు?" అన్నాడు సుదర్శనం.

"ఏమంటారు, దాన్నిగూడా ప్రేమే అంటారు"

"కాదు. బుద్ధి వ్యభిచరించిం దంటారు"

"శ్యామల్! ఉండు నే వస్తున్నా" అంటూ మాధురి లైబ్రరీలో నుంచి సుదర్శనం శ్యామల్ మాట్లాడుకునే చోటుకే వచ్చింది. ఆమె తెల్ల నిదుస్తులు ధరించుకోనుంది. చేతిలో ఒకపుస్తకం వుంది. అది "ఆర్యుల వివాహాలు-వారి నాగరికత" అనే పుస్తకం.

శ్యా—ఏమో అన్నావు సుదర్శనం?

సు—బుద్ధి వ్యభిచరించిం దంటారు.

శ్యా—అంటే.

సు—ఒకచోట నిశ్చితమైన ప్రేమ శాశ్వతంగా నుండకుండా ఇంకొకరిపై ప్రసరించటం.

శ్యా—అది స్వభావం

నీ వింకా అర్థమయ్యేట్టు మాట్లాట్టంలేదు. అన్నాయ! నే చెపుతా విను. ప్రేమతత్వం చాలా విశాలమైంది. ఈ విశ్వమంతా ప్రేమమయమే. ఇందు ప్రేమించగూడని వస్తువే లేదు. ప్రేమలో సర్వపాపాలు నశించిపోతై. ఒకదేశము నింకొకదేశము, ఒకజాతి నింకొకజాతి, ఒకవ్యక్తి నింకొకవ్యక్తి, ఒకమనుష్యు డొకజంతువును, ఒకజంతు వొకవృక్షమును, ప్రేమించుకూ ఇట్లా సర్వం ప్రేమయొక్క ఆధారంచేతనే సృష్టివ్యాపారం నిరంతరాయంగా జరుగుతున్నదని తెలుపుతున్నయి. అది ఒక నియమంలో బంధింపబడి వుండేదికాదు. దాని నెవ్వరు అరికట్టలేరు. దాని కత్యంతదృఢతరమైన పక్షములున్నై. కొండగుహల్లోనుంచి, జీమూతబంధురమైన సముద్రగర్భములోనుంచి, ఎంత దాచినా పెకల్చుకొని ప్రేమ స్వేచ్ఛావిహారం చేస్తుంది.

సుద—దానికి నీతితో సంబంధమే లేదా?

మాధు—నీతంటే?

సుదర్శనం తీక్ష్ణంగా చూశాడు. ఇది నానాటికి వృద్ధిఅయితూన్న యౌవనోద్వేగంవల్ల హిందూపావిత్ర్యాన్ని నాశనంజేసే ఆలోచనలు చేస్తున్నది. ప్రేమకు ఈవిరుద్ధవ్యాఖ్యానా లేంటికి? చదువుకుంటె మంచిజ్ఞానం వస్తుంది. దేశంయొక్క అభ్యుదయంకోసం కృషిచేస్తుంది అని అనుకొన్నాను. తరువాత తన మనోవాక్కాయాల కర్హుడైన వరుణ్ణి ప్రేమిస్తుం దనుకొన్నాను. స్వాతంత్ర్యం స్త్రీలకిందు కొఅకే వద్దన్నారు వెనక. ఇక చేసేదేముంది? అని విచారించటం మొదలెట్టాడు.

శ్యామల్ ముందుకు వచ్చాడు. 'నేచెపుతా' అన్నది మాధురి. "కొంచెం అభిప్రాయంలో భేదం. జాగ్రత్తగా గమనించు. రాగద్వేష విరహితమై, సర్వవిశ్వశాంతియే ఆశయంగా వుండే ప్రేమతత్వానికి నీతి యేమిటి? అది అంతా నీతికాదా?"

"మధూ! ఆస్వేచ్ఛ ఇష్టంవచ్చిన ట్లల్లా ఉపయోగించుకునే వాండ్లు ఆయనమాట్లాడిన నీతికి అర్థంచెప్పాలి, నువుకాదు" అన్నాడు శ్యామల్.

గంభీరమైన సుదర్శనం హృదయంలో పెద్దసంక్షోభం ఆరంభమైంది. అగాధమై, అగమ్యమై యున్న మాధురిప్రేమతత్వంలో అతనితల తిరిగిపోయింది. ఆమెమాటలే అతని కర్థంకాలేదు. తా ననుకొన్నరీతిగా మాధురిప్రేమతత్వ మంత సంకుచితమైనది కాదు అని అతనికి తోచింది. సుదర్శనం తనతో పాటు సంఘాన్నిగూడా తయారుచేయా లంటాడు. అందాకా వ్యక్తిమం దంజ వేయగూడదని, దాని వలన ఏమీ కలుగదని అతనిమతం. ఎంతో సంస్కారం కావలెనంటుంది అతని హృదయం. కాని అతని అభిప్రాయాలు అత ననుకొనే మార్పులకేమీసహాయం జెయ్యలేకుండా వున్నయి. అసలది మార్గమున్నకాదు. ఆలోచనతో సుదర్శనం లేచాడు. "మీ రనే తత్వం న్యాయంగా వున్నట్టు నాహృదయం వప్పుకోటంలేదు. అయినా, నావిధాన మేంటో తెలపటానికి ప్రయత్నిస్తా" అంటూ సాగిపోయినాడు,

పగలల్లా ఎండవేడిమిచే కాగిపోయిన నేలమీదనుంచి వచ్చే గాలి నీళ్లకుండలోపడి చల్లనై ఆపచ్చికపైన వీచేవరకు మరింత చల్లగా కొట్టింది. లిల్లీ పూలు వికసిస్తున్నాయి. మాధురి ఆపూలకేసి పోతూంది. చురుకుగా, గర్వంగా పోతూన్న ఆగమనంలో సమీరుడు అడ్డపడి దుస్తులు అల్లరిచేస్తుంటె శ్యామల్ కు కోపంవచ్చింది. పార్కులోంచి అంతా వెళ్లిపోయినారు. కొంతదూరంనడిచి మాధురి వెనక్కుచూసింది. శ్యామల్ యథాస్థానంలోనే వున్నాడు.

"వస్తా, అక్కడనే వుండు శ్యామల్!" అన్నది.

శ్యామల్ పరధ్యానంగా తలయూపాడు. శ్యామల్ ప్రేమలో రాగమున్నది. అసలు అనురాగంలేంది ప్రేమ రేమిటి? ప్రేమే ప్రధానమైన కామంగూడా ప్రేమలో కలసివుంటుంది. కామంలేకపోతే ప్రేమ అనేదే వుండదు. కోరికలేనివాండ్లు ప్రేమించడ మెందుకు? కనక తప్పకుండా ప్రేమలో కామ ముంది. ప్రేమంటే ఆమెకింకా అనుభవం లేదు" అనుకుంటూవున్నాడు.

౪

శ్యామల్ యింటిచద్దలేదు. ఆప్రాంతాల కితనే ప్రశస్తమైన డాక్టరు. దగ్గరపల్లెలో ఎవరికో చాలా జబ్బుగా ఉందని తీసుకెళ్లారు. రే పుదయానిక్కాని రాడు. ఆయనయిల్లు పెద్దభవనంకాదు. కాని కొద్దిలో చాలాఅందంగా, వీలుగా తయారుచేయించుకొన్నాడు. స్నానానికి, ఆఫీసుకు, చదువుకోటానికి ప్రత్యేకంగా గదులున్నాయి. స్నేహితు లెవరితోనైన మాట్లాట్టానికి, కులాసాగా తిరగటానికి దక్షిణపువైపు వరాండాముందు మంచిని ఆగ్రాప్రాంతాలనుంచి తెప్పించిన క్రోటన్సు, చైనాబాక్సులా, నైట్ క్వీను, పారిజాతం, అన్నీ వున్నాయి. మధురమైన ప్రకృతిసందేశం రసోపాసకులకే వినిపిస్తుంది.

సుదర్శనం తరచు శ్యామల్ యింటికి వస్తూవుంటాడు. అతనికిప్పుడు క్రిష్టమసు శెలవులు. శెలవల్లో అతని కేం చదువుకోటం అభ్యాసంలేదు. సూక్ష్మగ్రాహిగనక చదవకున్నా క్లాసుల్లో సరిగ్గా మార్కులు వస్తూనేవుండేవి. శ్యామల్ ఉన్నాడేమోనని తిన్నగా అక్కడికి ప్రయాణమైనాడు. తలుపులు తీసే ఉన్నాయి. ఎవరో దాసి మనిషి పని సవరిస్తోంది.

"డాక్టరుగా రున్నారా?" అని అడిగాడు.

"లేరు. లోపలికిరా. సుదర్శనమా వచ్చింది" అంటూ కోమల తువ్వాల మడుతూన్న దిన్నంగానేలేచి రెండడుగు లేసింది. ఆమె అప్పుడే అభ్యంజనం చేసింది. పసరుపోయిన ఆకండ్లు కొంచెం ఎరుపుగావుండటంచూస్తే, నిద్రలేక ప్రియుడి బాహువుల్లో గడిపిన పరిశ్రాంత సౌందర్యం తొలుకుతూన్నట్టుంది.

"మాధురి రావటంలేదు మాయింటికి?"

"నేనచ్చా కాను?"

"మీ డాక్టరుగారికోసం వచ్చావాయ"

"జబ్బులొచ్చేవాండ్లకు డాక్టరుగాని నాకూ డాక్టరే! సరేగాని, ఎన్నాళ్లిలుతా మీతువ్వాల?"

"మీవాదాలన్నీ కట్టుబడేలోగా కాకపోతుందా?"

"అయితే అతననే మాటలకేమైన అర్థముంది? ప్రేమ చంచలమైందే అంటావా?"

"వారు పురుషులు, స్వతంత్రులు"

"కోమలా! నువు పూర్వకాలందానివి. నీకేం తెలియదు. ప్రస్తుత స్థితినిబట్టి మార్పు అవసరమైనా, సంఘాన్నే వేరుతో పెకిల్చే అభిప్రాయాల్లో న్యాయంలేదు. అది క్రమంగా రావాలి."

సుదర్శనం కోమలను డాక్టరుకన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నాడు. కోమల ప్రవర్తన, మాటలు అన్నీ అతని కిష్టం. ఎక్కువ అంద శాలి కాకున్న, సమున్నతమైన ఆకారం, కొంచెం చామనిఛాయ రంగు, ఆకండలు, వంపులు, ఆమె ఆరోగ్యాన్ని తెలుపుతున్నై. భారమైన ఆమెజుట్టు, మెరిసే కండ్లు, సాత్విక తేజస్సు అతనికి చాలా యిష్టం. శాంత గంభీరమైన ఆమెవక్షస్థలముపైన అతని హృదయ మెన్నిసార్లో కలలు కన్నది. మారులోంచి బల్లి వకటి ఆమెభుజంమీద దూకింది. తువ్వాల అక్కడ పడేసి లేచింది. తొందరగా పోయి సుదర్శనం దాన్ని దులిపాడు. బల్లి క్రిందబడి పరుగెత్తిపోయింది. కోమల సుదర్శనంకేసి తీక్ష్ణంగా చూసింది. ఆకళ్లల్లో లజ్జావమానాలు పొంగులెత్తినై. అక్కడనుంచిలేచి యింట్లోకి పోయింది. సుదర్శనం భయావేశంతో కంపించిపోయినాడు. ఏమీ మాట్లాళ్లేదు. ఒకఅడుగుకూడా ముందుకువేయలేదు. మెల్లగా లేచి వరాండాదాటి యింటికి బయలుదేరాడు.

"ఆమె యిట్లా చూస్తుందా? ఆనేత్రా లంత క్రూరంగా మారినదేం? కరుణామోహనంగావుండే ఆకళ్లల్లో ఎంతగాంభీర్యం నిండుకొనుంది? సుదర్శనంజీవితం యికవృథాకావలసిందేనా? సౌఖ్యమే లేదా? ఆశావివశమైన యీహృదయం విస్మృతిపథంలో పడిపోయింది. సరే, ఈసంగతి ఆమె శ్యామల్ తో చెపుతుందేమో! ఎంతో చనవుగా తిరుగుతూవున్న నేను నామిత్రుడి కెంతద్రోహం చేశాను? ఎంత మిత్రుడైనా శ్యామల్ నన్ను క్షమిస్తాడా? నిరాశాహతుణ్ణై పోవటమేకాకుండా అంతులేని అవమానంతో నశించిపోవాలి సొచ్చింది. నాప్రవర్తనాన్నిగురించి ఎంతో తృప్తి వహించే మాధురి ఏమనుకుంటుంది?" ఇట్లా వితర్కించుకుంటూ సుదర్శనం తనమేడ్లో రెండో అంతస్థుమీద గదిలో ఘోరంగా ఊపిరివిడుస్తున్నాడు. ఒళ్లంతా చే డెక్కింది.

మర్నాడు ఉదయానికి డాక్టరు యింటికి వచ్చాడు. ముందుగా వస్తున్నానని శ్యామల్ మనిషిని పంపాడు. కోమల వంటచేసుకొని

సిద్ధంగా వుంది. శ్యామల్ భోజనంచేస్తూ—, "మాధురి, సుదర్శనం ఊళ్లోనే వున్నారా?" అన్నాడు. "ఉన్నా"రన్నది కోమల. సుదర్శనంమాట మళ్లీ జ్ఞాపక మొచ్చింది కోమలకు. కళ్లలో నీళ్లు తిరిగినై. 'నేను చాలాఘోరంగా అతన్నాదరించాను. బల్లిపాటుకు నేను భయపడుతుంటే దులిపాడు. అదివక పెద్దతప్పా? ఇంట్లో కెల్లి మళ్లీ వచ్చేవరకు అత నక్కడ లేడు. నన్నెట్లా అర్థంచేశాడో! అతని మాధురికి కాదు; నాకు సోదరుడు. అటువంటి చనవుతో యిన్నాళ్లనుంచి మాయింటి కొచ్చేవాణ్ణి ఎన్నటికి తిరిగిచూడరానంత అన్యాయంగా ప్రవర్తించాను.' తాను చేసిన అన్యాయాన్ని గురించి చాలా పశ్చాత్తాపపడుతోంది కోమల. ఎట్లాగైనా అతన్ని ప్రసన్నంచేసుకోవాలి. తన అపరాధం మరచిపొమ్మని కోరాలె. ఈసంగతి భర్తతో ఏమనిచెపుతుంది? అట్లా చెప్పొచ్చునా? ఈ మనోభారం, వ్యాకులత ఎట్లా తీరుతుంది? పదిరోజు లైంది. సుదర్శనం రావటమే లేదు శ్యామల్ యింటివైపు. ఇంటర్ మీడియేటు పరీక్ష దగ్గరి కొచ్చింది. వంట్లో ఏమీ స్వాస్థ్యం లేదు. పుస్తకాల మీదికి దృష్టే సారించటం లేదు. కోమల భర్త వ్రాసుకొంటూంటే వెళ్లి దగ్గర నిల్చుంది ఏమో చెప్పాలని.

శ్యా—అవతలికి పో.

కో—ఇదేమిటి ఇవ్వాళ?

శ్యా—ఏమీ లేదు, కొంచె మాగిరా.

కో—మీయిష్టం వచ్చినప్పుడా?

శ్యా—(విసుగుతో) ఔను.

కో—(మందహాసముచేస్తూ) ఎంచాత?

శ్యా—వాక్క. చెపుతుంటే.

కో—ఇదేదో కొత్తపద్ధతిలా వుంది—అకేసు నయంలే?

శ్యామల్ కాగితం బల్లమీద పారేసి విసుగుతో "నువు పోయి నయంచెయ్యి"అన్నాడు.

"బాగానే వుంది"అని నవ్వుతో కోమల యింట్లోకి పోయింది. ఏదో వుత్తరం వ్రాసి మడిచి కవర్లో పెట్టి బంట్రోతునుపిలిచి మాధురి కిచ్చి రమ్మని పంపాడు. తానుగూడా లోపలికి పోయినాడు. దక్షిణపు వరాండాలో సుదర్శనంకూచున్న చోటనే కూచోని, కోమల అతని చదువు, ప్రవర్తన, తలుచుకొని తన అవివేకాన్ని నిందించుకుంటూ విచారపడుతూన్నది. కోమల ముగ్ధ. తనజీవితంలో ఎన్నడు శ్యామల్ తప్ప ఇతరవ్యక్తిని ప్రేమించలేదు. చిన్నతనంనుంచి శ్యామల్ తో ఆడుకొని, ఒకచోట తిని పెరిగింది. శ్యామల్ తల్లి మేనరికమని, తల్లి లేనిదని తన యింట్లోనే వుంచుకొని కొడుకన్నా యెక్కువ గారాబంగా పెంచింది. ఆమెవున్నన్నాళ్లు అది అత్తవారిల్లనే స్పృహే లేకుండా తిరిగింది. కోమల భర్తగూడా చాలా అనురాగంగా కోరిన జిల్లాతెస్తూ క్రమంగా డాక్టరీపాసయి మంచిపలుకుబడి, వివేకం సంపాదించి, కోమలను చాలా గౌరవంగా, ప్రాణతుల్యంగా చూస్తూవుండేవాడు. శ్యామలునితల్లి పోయిన మార్చినెలలో కాలంచేసింది. అప్పటినుంచి కోమలయే యింటివ్యవహారాలన్నీ తానే స్వయంగా చూసుకుంటూ జాగ్రత్తగా భర్తయే దైవంగా నడుచుకుంటూన్నది.

ప్రేమ చంచలమైంది కాదని, ఒకచోట నిశ్చితమై ఏకాగ్రమైనప్పుడది క్రమంగా వృద్ధిపొందుతుంది గాని శాశ్వతమై, క్షణికమై మెరిసించే తాత్కాలికభౌతికనాట్యం ప్రేమను చలింపజేయలేదని ఆమె నమ్మకం. ఎందరో నవమన్మథాకారులు, విజ్ఞానవంతులు, ఆమె దృష్టిలో సోదరులుగా మన్నింపబడ్డారు. అట్టి వారిని చూచినప్పుడల్లా భర్తమీద ప్రేమ, భక్తి, మరింత ఉత్తేజితమయ్యేవి. ఎందుకంటె ప్రపంచములోని అద్భుతత్వమంతా అతనిలో ఉపాసిస్తున్నది. శ్యామల్ ఇంతలోకే వచ్చాడు. కోమల లేచినిలుచుంది. నిశ్చింతమైన ఆమెశరీరంకేసి చూస్తున్నాడు. ఆమె యేంమాట్లాడలేదు. శ్యామల్ గూడా మాట్లాడవద్దనే అనుకున్నాడు. అయిదునిమిషాలయ్యేవరకు ఆగలేక పోయినాడు. ఏసమయంలో ఎట్లా ప్రేమించాలో శ్యామల్ కు బాగాతెలుసు. అందులో కోమల తన ఆబాల్యకృతజ్ఞతకు పాత్రమైన ప్రవర్తన గలది. తన్ను మహాభోగినిగా చేసిన విశేషగుణాలు. ఆమె యేస్థితిలోవున్నా శ్యామల్ కు ప్రేమార్హయే.

శ్యా—ఏంవచ్చావిందాక?

కో—పనిలేక.

శ్యా—అడుగుతుంటే యింతే.

కో—అసలు మీకు ప్రేమతెలీదు.

శ్యా—ఓహో! నీక్కాదా యీప్రేమతత్వంబోధచ ఆవేశించింది? ఏదో రాసుకుంటూంటె ఆమాట లేంటి?

కో—ఏదో చెప్పదామని వస్తే 'అవతలికిపో' అనొచ్చు.

శ్యామల్ బలిష్ఠంగావున్న ఆమె బాహువుదగ్గర శిరస్సుంచి "చెపుదూ చంపక" అన్నాడు.

కోమల భర్త కళ్లల్లోకి చూస్తూ

"సుదర్శనం సుస్తీగావున్నాట్ట. తెలిసిందా?" అన్నది.

శ్యా—ఇవ్వాళనేగా రావటం. వెళదా మనుకొన్నా. వెళ్లలేదు,

కో—అతనికి పరీక్షలు దగ్గరకొచ్చినై పాపం!

"ఇదేనా నువుచెపుతానని వచ్చింది?" అన్నాడు శ్యామల్.

"వెళ్లి చూసి మందిచ్చిరండి"

శ్యామల్ కండ్లల్లో రేఖలు ఎఱ్ఱనయినై. 'ఈమె యిట్లాచెపుతుందేం? తనకేం సంబంధం' అని కోపంతో లేచిపోయినాడు.

౫

అప్పుడే వానకురిసి వెలిసింది. పొగడచెట్టుక్రిందుగా పోయేవాగు జాలులో ఇందాకా పొంగువారినప్రవాహం ఆగిపోయింది. అది తొలకరించిన మొదటివాన. తెల్లని ఆ ఇసుక అంతా, జాలులో తరంగాలు చిత్రించుకుంది. భూమిలోనుంచి బయలుదేరే కమ్మనివాసనలో వానదెబ్బకు రాలిపోయిన గులాబీరేకుల్లోంచి రేగే మాధుర్యం ప్రకృతి గాంభీర్యం ప్రస్ఫుటంచేసింది. మెల్లగా గాలివీచినపుడల్లా అశోకంలోనుంచి బిందువులు రాలుతున్నాయి. ఆకాశం నెమ్మదిగా ఉరిమింది. కాని అది వానకోసం కాదు. శ్యామలుడు నిర్వేదంతో ఒక్క నిట్టూర్పు విడిచాడు. "మధూ! మనోహరమైన ఈదృశ్యం వర్షంవల్ల ఎంత బీభత్సమైంది. పాపం ప్రయాసపడిరావుగాదా!" అనుకుంటూ లేచాడు. మేఘాలన్నీ విడిపోయినై. ఒక్క మేఘశకలంమాత్రం అంతులేకండా పరుగెత్తుతోంది. జాబిల్లి పరుగెత్తిపొయ్యే మేఘంలోంచి తొంగిచూశాడు. వనమంతా ఆనందమయమై పోయింది. చెట్లమీద నీటిబిందువులపైన వెన్నెలకాంతిపడి వనమంతా ముత్యాలతో రణాలుగట్టి యలంకరించినట్లైంది.

ఎవరో తొట్రుపాటుతో వస్తున్నారు. ఆమెచీరంతా తడిసింది పాపం! తలపైని నీలపు ముసుగు. ఆముఖంమీద చంద్రకిరణాలు ప్రసరిస్తూవుంటే కండ్లు తళతళ మెరిసినై. ఆమెమొహంమీది సన్ననినీటిబొట్లు అక్కడక్కడ యింకా ఆరనేలేదు. తల అంతగా చెదరలేదు. కాని ముంగురులు కొన్ని వానకు తడిసి అతుక్కుంటె గాలికి కొన్ని రేగి కొట్టుకొంటున్నవి.

బలిష్ఠమై మెరిసే ఆమెశరీరసౌష్ఠవం ప్రకృతిశోభను మరపించింది. శ్యామల్ పొగడచెట్టు కిందికొచ్చేవఱకు ఆమె వెనగ్గా ఆగిపోయింది. అనుక్షణం నిరీక్షించే శ్యామల్‌కు మాధురి వచ్చిందేమోనని పించింది. వెనక్కు తిరిగాడు. హృదయం పొంగివచ్చింది.

పొగడచెట్టునుంచి పూలు రాలినై. "మధూ! మధూ! నాకోరకెంత బాధ?" అన్నాడు.

"నీకొఱకుగాదు, అందరికోసం" అన్నది. కండ్లవెంట జలజలా నీళ్లు కారినై.

శ్యామల్ ఉద్వేగంతో మాధురిని దగ్గరకు తీసుకొని "అయ్యో! బట్టలన్నీ తడిసినై. ఏమిటి అట్లా అంటావు?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

మాధురి వస్తుందనే ఆశతోట్లో డాబాకింద రెండుపక్కలు సిద్ధంచేయించాడు. రెండువేపుల కిటికీల్లోంచి చల్లటిగాలి వీస్తోంది. ఆతోట్లో అప్పుడప్పుడు సమావేశం అవుతూ, ఇష్టాగోష్టిగా పొద్దుపుచ్చుకుంటూ, చదువుకుంటూ ఉంటారు. వాండ్ల బట్టలు, పుస్తకాలు అన్నీ ఆరామములో పక్కనే వుంటయి.

మాధురితండ్రి తహసీల్‌దారుపనిలో వుండేటప్పు డీతోట చవుకగా అమ్మకాని క్రొత్తే తీసుకున్నాడు. ఆయన దానిమీద ఆదాయంకూడా తీసేవాడు. కాని సుదర్శనం ఆవ్యవహారాలు చూస్తున్న దగ్గరనుంచి ఆదాయంకోసం పెనగులాడక అంతా మాధురివిలాసం కోసమే దాన్ని వదిలేశాడు.

శ్యా—ముందు లోపలికెళ్లి బట్టలేసుకో, మాట్లాడుదాం.

మాధురిలోపలికి పోయి బట్టలు వేసుకుంది. తెల్లని చీర, జరీపని చేసిన వదులైన చైనా సిల్కురవిక. మాలతీపూలు జారిపోతున్నాయి ఆజుట్లోంచి. ఆమె బయటికి వచ్చింది.

"సుదర్శన మేమన్నా అన్నాడా?"

ఆమె మాట్లాడ్లేదు. నిశ్వాసభారంచేత సుందరమైన ఆమె వక్షస్థలం కంపించిపోయింది.

శ్యా—ఏం చెప్పు. నాతోచెప్పటానికేం అభ్యంతరం? నేనివరి తోటి అననుగా.

మా—మా అన్నయ్య యింత క్రూరుడని నాకు తెలియదు.

"సుదర్శనమా?" అని తనమంచం దగ్గర కీడ్చుకున్నాడు శ్యామల్.

మా—నాప్రవర్తన మతనికర్థమే కాలేదు. నన్ను చాలా అనుమానంగా చూస్తున్నాడు. నావల్ల తనకు సంఘంలో చాలా అవమానంగా వుందిట.

శ్యా—సంఘం? సంఘం న్యాయాన్నే విమర్శిస్తుందా? సంఘం నిజంగా గుడ్డిది. ఏవాడో అవసరపడి నిర్మించుకొన్న తత్వం ఈనాడు సరిపడక దేశమంతా పాడయిపోతున్నా, ఆచారంకొరకు వ్యక్తులను, తనమ్మాలకంగా జాతినంతా నిర్వీర్యంచేస్తున్నది సంఘం. ఈయన సంస్కారప్రియుడుగా మరి.!

మా—ఇంతకాలం పెండ్లి లేకుండా వుండటం ఏమిటని మా ముసలమ్మ ఒకటే గోల. అన్నయ్యకుగూడా నామీద వేరు భావం కలిగింది. ఇంట్లోవుండటం చాలా కష్టముగా వుంది.

శ్యా—నీకుమాత్రం ఎందుకు స్వాతంత్ర్యంలేదు యింట్లో వుండటానికి? నీకేం కష్టం? నాదగ్గర కొచ్చేయి. నిన్ను కళ్లో పెట్టి పూజించుకుంటాను.

మాధురి ఏదో ఆలోచనతో చూస్తోంది. శ్యామల్ ఆమె హృదయావేగం మాన్పటానికి యత్నిస్తున్నాడు. వివాహం స్త్రీ నిర్బంధంగా ఎందుకు చేసుకోవాలో మాధురికి అర్థంకాలేదు. వివాహం చేసుకోని వాళ్లంతా నీతిబాహ్యులేనా? పెండ్లిపేరుతో జరిగే ఘోరాలు సామ్యంగాపెట్టుకుంటే ఇది ఎంత పవిత్రమైందో లోకానికి తెలీదు. వివాహం ఒకవిధంగా ప్రేమయొక్క సంకుచితరూపం గావచ్చు.

ప్రపంచాన్నంతా ప్రేమించటం పెళ్లి చేసుకున్న వాళ్లకు తెలీదు. ఒకరినొకరు ప్రేమించుకోటంతోటే వారిబాధ్యతలు తీరిపోతై. మిగతా లోకమంతా వారి ఆదరణకు పాత్రం కాదు. సర్వం ద్వేషమయంగానే తోస్తుంది. ఇట్లాంటి ఆదర్శంతో జరిగే పెండ్లిండ్ల వల్ల లోకాని కేం ప్రయోజనముంది? అందున అభిప్రాయ భేదాలు, అన్యోన్య అసహనం ప్రబలి ఒకరిపైనొకరు పశుత్వంగా సంచరించడం, ఇంత అన్యాయం, అవినీతి పాకిపోయినై. ఇంకా సంఘాన్ని పట్టుకొని వ్రేలాడాలంటే వివేకంగల ఏపురుషుడు, ఏస్త్రీ ఒప్పుకొనరు? మాధురికి పదహారేండ్లు వచ్చినయి. ఏకాగ్రమైన ప్రవర్తన గలది. మానవుడు లోకంలో జీవించియుండాలంటే ప్రేమించడమే నేర్చుకోవాలి. శరీరంలోని అన్ని కోశముల్లోంచి ద్వేషం నశించి పోవాలి. ఆ ప్రేమ సృష్టిలో విద్యుత్ప్రవాహంలాగు అనుక్షణం కదుల్తోంది. అన్ని భూతాల్లోకన్నా మానవుడు వివేకంగలవాడు గనుకనే దాని సరియైన స్వరూపం చూస్తాడు. ఆమహాసత్యం లోకానికి చూపిస్తాడు. ఇట్లా ఈసత్యంగ్రహించి ఉపాసించడానికి సంఘంవల్ల నిరోధం కలుగనే, అవలీలగా సంఘాన్ని త్రోసివేసి వ్యక్తిత్వం దంజ వేయవచ్చు. ఇది మాధురిమతం.

శ్యా—మధూ! ఏమి టాలోచిస్తున్నావు?

"నే వెళతా" అని లేచింది. వెంటే శ్యామల్ బయలుదేరాడు. ఊరో కెంతో ఆనందంగా గడపాలనుకున్నాడు. పాపం మాధురి మనస్సేమీ ప్రశస్తంగా లేదు.

పున్నాగంశాఖలు క్రిందికే పాకి ఉన్నయి. ఒకశాఖమీద చేయివేసుకుని చంద్రుడికేసి ఊరికె మాస్తూ నిల్చుంది. శ్యామల్ ఎదురుగా నిల్చొని భుజంమీద చెయివేసి, "నీవు వెన్నెల్లో దీపమువు, ఇంతవిచారంతో" అన్నాడు. మధుముఖంలోని, కళ్లల్లోని అమృతమంతా తాగుతూన్నట్లున్నయి శ్యామల్ నేత్రాలు. ఆమె యేం మాట్లాడ్లేదు. గాలికి తలమీదముసుగు లేచిపోయింది. శ్యామల్ సర్దుతూ—

"నా సేవ నీకిష్టం లేదుకదూ!" అని అన్నాడు.

మధు బొమలు ముడివడ్డయి. తిన్నగా అతనికేసి చూసింది. "నువ్వు నాకెందుకు సేవచెయ్యాలె శ్యామల్, నీచిన్న చేతుల్తోటి? నే నొప్పుకుంటానా?"

క్రమంగా మాధురి తన ఆలోచనలన్నీ వెనక్కుతోసేసింది ఏదో సమాధానంచెప్పి.

శ్యా—నీ వట్లా వుంటావుగాని క్షణం నిన్ను చూడకపోయినా బతకలేను.

మా—అయ్యో! నావల్ల ఎంతబాధ నీకు?

మాధురి అతనిచంపలు దయతో నిమిరింది.

"నామీద ఎందుకింత ప్రేమ నీకు?"

శ్యామల్ ఏంమాట్లాడకుండా తల వంచుకున్నాడు.

శ్యా—ఏం దుకంటే—నీవు మాధురివి గనుక.

మా—నిజంగా?

శ్యా—నీవు నాదానివి కావాలని, నీ అమృతమయములైన కళ్లు ఎప్పుడూ చూస్తూ వుండాలనీ నా ఆకాంక్ష.

మా—అది ఎట్లా సిద్ధిస్తుంది?

శ్యా—నావిశ్వాసంచేత—నా నిరతిశయమైన ప్రేమచేత.

మా—నీ ప్రేమపైన నీకు నమ్మక ముందా?

శ్యా—ఆఁ.

మా—అట్లయితే నేనెప్పుడూ నీయెదుట ఎందుకు శ్యామల్?

మాధురిహృదయంలోంచి అపారమైన ప్రేమతరంగాలు పొంగులు పారినై. ఒక్కసారి శ్యామల్ కళ్లల్లోకి దీనంగా మాశి అన్నది.

"నేనంతా నీదాన్నైపోతే సృష్టిని నేను ద్వేషించినదాన్ని కాదు? నాకు విశాలమైన హృదయమే లేదన్నమాట. అగమ్యంగా జరిగిపోతూన్న సృష్టిలోని నిత్యవ్యాపారం నా కెట్లా తెలుస్తుంది? నా కనుభవం ఎట్లా కలుగుతుంది?"

శ్యా—అదంతా నా కవసరం లేదు. నీవు నా క్కావాలె. నిన్నే చూస్తూఉండాలి. నన్నే మిచేసినా సరే. నాజీవనం, సౌఖ్యం అంతా అప్పుడే వుంటయి.

మా—ప్రేమగలవాడికి అపారమైన ప్రేమావేశంలో వ్యక్తి లేకపోతేమాత్రం ఏంబాధ?

శ్యా—అదికాదు. ప్రేమవున్నా వ్యక్తికూడా అవసరం. అది దేహధర్మంచేత కలుగుతుంది. అది అనివార్యంకూడాను.

మాధురికి కొంచెమీమాటలో ఆలోచన కలిగింది. "ఔను, దేహానికి, మనస్సుకు అటువంటి సంబంధ ముంది. నిర్గుణమై సర్వవ్యాపకంగా వుండే ఆత్మకు నామరూపాత్మకమైన భిన్నసృష్టి కలగడంచేతనే తానని, పరుడని భేదభావం ఏర్పడుతున్నది. అందులో వివేకంగల వాండ్లుమాత్రం ఆత్మయొక్క ఈసృష్టిక్రమరహస్యం తెలుసుకొని లోకమంతా ప్రేమపూర్ణమైన, భేదమే లేని ఒకే చిన్మయానందమని నిత్యముక్తులై సంచరిస్తారు." అని మాధురి వితర్కించుకొని

"అయినా అది యింకా పక్వదశ కాదంటాను" అన్నది.

శ్యా—ఔను, దేహం ఉన్నంతవరకు కాలేదనేచెప్పాలి.

మా—దేహ మేం ఆటంకం చేయదు. అది కాకుండా దేహం తన అభిప్రాయాన్ని వెల్లడించటాని కొకసాధనంగాకూడా వుంటుంది అనుకుంటాను.

శ్యామల్ ధోరణి నేం పైకెక్కనీయటం లేదు మాధురి. మాధురి సామర్థ్యం, ఆమె ప్రేమయొక్క తత్వం క్రమంగా తెలుస్తున్నయి. ఎవరో వేదాంతులుచెప్పేమాటలుగాని యివి సామాన్యంగా లోకం దీనిని వప్పుకోదు. అయితే యీపాపం రోజుకురోజు నూత్నవికాసాన్ని పొందేరోజుల్లో ఇట్లామాట్లాడ్డం చాలా ఆశ్చర్యంగా దోచింది అతనికి.

చాలా పొద్దుపోయింది. ఇక యింటికి పోలేక మాధురి పకళయ్య మీద, శ్యామల్ పకళయ్యమీద పడుకున్నారు. చంద్రుడికి రాత్రల్లా వారిని కాపలాచెయ్యడమే సరిపోయింది. కిటికీలోంచి పాకుతూవచ్చి తీగలు మాధురికి ఆవెన్నెలతీక్ష్ణం తగలకుండా చేస్తున్నయి. శ్యామల్ ఊరక మసుల్తున్నాడు. ఇందాకటినుంచి మాట్లాడిన మాటలన్నీ అనుక్షణం ఎదుట నిలుస్తున్నయి. చివరకు నిద్రపట్టింది. తెల్లవారుజామైంది. కొంచెం ఈదురుగాలి వేస్తోంది. తెల్లవార్లు మేలుకొన్నందువల్ల శరీరం బడలిపోయి పడమరగా తూల్తున్నాడు. మసకవెల్తురు తీగల సందుల్లోంచి మాధురిమీదపడి కొత్తరకంగా చిత్రిస్తున్నది. మాధురి కండ్లు నుసులుకుంది. లేచికూచుంది వళ్లు విరుస్తో. చల్లంగా కొట్టింది గాలి. శాలువతీసుకొని వేసుకుంది. శ్యామల్ నిద్రపోతున్నాడు. అతని కనుబొమ్మలేవో ఆలోచన చేస్తున్నట్లుగా వంపుతిరిగెయున్నై.

మాధురికి శ్యామల్ను చూస్తే చాలా జాలేసింది. పాపం! ఈతడు నన్ను ప్రేమించాడు. నేను తనదాన్నైపోవాలని అతని కోరిక. నేను తనమాధురినైతే ఇక ప్రపంచమే అవసరంలేదు. ఈ వెర్రిలో పాపం కోమలను వదలేస్తాడేమోకూడా. ఇది కామంతోగూడిన ప్రేమ. అందుకోసమనే ఒకదానికన్నా ఒకటి అందంగా కనబడినప్పుడల్లా మారిపోతూంటుంది. సౌందర్యం ప్రేమయొక్క కవచం దొంగిలించిందొకనాడు. అదివేసుకొని, దుర్బలహృదయాలన్నీ ధ్వంసంచేస్తున్నది. సౌందర్యం జడమైంది. ప్రేమ జీవంగలది. ప్రేమలేని సౌందర్యం భయంకరమైందికూడాను. కనుక సౌందర్యం ప్రేమకాదు. ప్రేమే సౌందర్యం. అది నిశ్చితమైనప్పుడే సౌందర్యాన్ని కాంక్షించదు. ఆ ప్రేమ ఎంత వృద్ధిఅయితే, ఎంత ప్రేమించగలిగితే అంతసౌందర్యం కానుపిస్తుంది. అప్పుడు ఒకశత్రువు, ఒకవికారి, ఒకక్రూరమైన జంతువు, అంతా సౌందర్యమయమే. అప్పుడు సౌందర్య మెక్కణ్ణో వుందని దానికోసం పాకులాడాలసిన అగత్యం తప్పిపోతుంది.

అయితే ఈభౌతికసౌందర్యానికికూడా ప్రాధాన్య ముంది. ఒకవస్తువు అందంగా కనబడితేనేగాని దానిదగ్గరకు పోడు. అప్పుడుగాని ప్రేమించడం ప్రారంభంకాదు. అప్పుడే ఆరహస్యం తెలియటాని కారంభం. క్రమంగా ఆప్రేమను అర్థంచేసుకొని పక్వదశకు తెచ్చుకున్న ప్రేమతో ఈజగత్తునంతా ప్రేమించవచ్చు. తనప్రేమలో కామం వుంటే, అది స్వార్థపరమై, సంకుచితమై అక్కడనే నిల్చిపోతుంది. కామాన్ని అధిగమించి స్వచ్ఛతను, సమత్వంను అలవరించుకొన్నప్పుడది విశ్వవ్యాపకమై మహోపకారం జేస్తుంది.

ఇక కామం నశించడ మెట్లా? ప్రేమిస్తేనేగాని కామం నశించదు. అందుకొరకే గృహస్థాశ్రమం మహాఋషులుకూడా అంగీకరించారు. ఆహా! గృహస్థాశ్రమం ఎంతపవిత్రాదర్శముగలది! ప్రేమస్వరూపాన్ని చూడటానికి ఈ ఆశ్రమం చాలా సహాయం జేస్తుంది. అది స్త్రీపురుషుల జన్మజన్మాంతరసంస్కారంచేత ఏర్పడుతుం దంటారు. ఏదిఎట్లావున్నా, మనుష్యప్రయత్నం చేత, భౌతికసాధనోపాయాలచేత సిద్ధించే దాంపత్యంకన్నా పైనచెప్పిందే ఉత్తమమైంది. అట్లాంటి దాంపత్యమే సిద్ధిస్తే అందు ప్రదర్శింపబడే కామమే ప్రేమ అవుతుంది. ప్రేమే కామ మవుతుంది. అప్పుడు అవస్థాభేదమేకాని అర్థభేద ముండదు. అప్పుడు ప్రపంచంలో జరిగే మానవజంతుసముదాయాల యోగక్షేమం కొఱకు పనిజేస్తూవున్న యేమహాసంస్థనైనా మొత్తంగా అవ్యక్తి ప్రేమించడానికి తగిన హృదయదార్ఢ్యం కలిగివుంటుంది. అట్టిలోకకళ్యాణంకోసం భౌతికభోగాలను, ప్రియమైన తన విశిష్టవస్తుజాలమును, ఒక్కసారి ఆమహాప్రపంచప్రేమ యజ్ఞానలంలో హోమంచేయగలుగుతాడు. ఆత్మార్పణంచేయటానికైన అభ్యంతరం వుండదు." ఇట్టి ఉత్తమదాంపత్యసిద్ధికోసం మాధురి నిరీక్షిస్తున్నది. ఇందుకొరకే ఆమె వివాహంచేసుకోలేదు. శ్యామల్ను పెండ్లాడాలంటే ఆమె హృదయం వప్పుకోటంలేదు. ఇంతకుముందే వివాహితుడైన శ్యామల్లో కావలసినంత మార్పు కాలేదు. అతని జీవితసౌధం ఏపునాదులపైన నిర్మింపబడ్డదో ఇంకా ఆమెకు తెలీదు. మాధురిఅభిప్రాయప్రకారం వివాహితుణ్ణికూడా ప్రేమించవచ్చు. అత డంగీకరించకపోతే ఆప్రేమ యింకో పునీతమార్గాన్నే అన్వేషింపవచ్చు. శ్యామల్ యింకా లేవలేదు. తెల్లవారకముందే మాధురి తన యింటికి పోయింది.

౬

గ్రామంలోవున్న బ్రాహ్మణసంఘంలో రహస్యంగా జరుగుతూవున్న ఆలోచనలన్నీ బహిర్గతమైనై. నిన్న సుదర్శనాన్ని పిలిపించి మందలించారు మాధురిప్రవర్తనాన్నిగురించి. "నీతిబాహ్యమైన యీప్రచారం, నడనడి ముందు చాలాకష్టాలకు కారణ మౌతై" అని చెప్పినారు. వాండ్ల కుటుంబాన్నంతా బ్రాహ్మల్లోంచి బహిష్కరించటానికి తీవ్రప్రయత్నాలు జరిగినై. తండ్రి సంపాదించిన గౌరవప్రతిష్ఠలుమాచి యింతకాలం ఓర్చారు. కొంతమంది అసలు యిట్లాంటివ్యక్తి మనవూళ్లో వుండటం చాలా అగౌరవమని, రహస్యంగా, ఎక్కణ్ణో మాధురిని చంపాలని యత్నం జేస్తున్నారు.

క్రమంగా యీవార్తలన్నీ సుదర్శనానికి తెలియవచ్చినై. శరీరాస్వాస్థ్యము, తీరని ఈవ్యాకులంలో సుదర్శనం మేధస్సంతా కరిగిపోయింది. కోమల తనదికాదని దుఃఖిస్తాడా? ప్రియమైన చెల్లెలు, ఉదారస్వభావం గలది, తన తల్లిదండ్రులు గతించినప్పటినుంచి ఒక్కచోటనే ఎడబాయకుండావుండి తనతోపాటు స్కూల్లోగూడా తిరుగాడిన ఆస్నేహం, వాత్సల్యం తోసివేస్తాడా? పరిస్థితులన్నీ సర్వనాశనంగా మారిపోతూనై.

ఇహనైనా వివాహాని కొప్పుకుంటే సుదర్శనం వాళ్లందరితో చెప్పి ఏం ప్రమాదం లేకుండా చేయగలుగుతాడు. ఒకరు చెప్పే దేముంది? ఆమెమతం ఆమెది. సుదర్శనం మాధురితో మాట్లాట్టంగూడా లేదు. చాలాద్వేషంగా చూస్తున్నాడు. తెనమూలకంగా పరువుభంగం. తర తరాల్నుంచి వస్తున్న కులమర్యాదంతా నశించిపోతూన్నది. సంఘ మంతా త్రిప్పింది ఒకరుచేస్తే ఏమవుతుంది?

కోమల తన్ను ప్రేమించ లేదు. ఇక బతికడ మెట్లా ఆమె తన్ను మన్నిస్తుందని? రహస్యంగానైన ఆమె తన ప్రేమను జూపిస్తే అతనికి బాధలేదు. సుదర్శనానికి ప్రపంచంలో ఎవరినీ భార్యగా పొందాలనే అభిలాషే లేదు తన అభిప్రాయం మార్చుకోటానికైనా. కోమలతప్ప తన జీవితానందానికి ఆధార మే లేదు. అట్లాంటి కోమల తన హృదయం కనుక్కో లేదు. శాశ్వతనరకంలో పడేసింది తన జీవిత మంతా. తుదకు సుదర్శనం తన మరణశయ్యమీదనైన ఆమె ప్రేమిం చిందని విని పునర్జన్మభారం తగ్గించుకుంటాడు. కోమలబాహువులు, ఆమన్నని చెంపలు, అపరిష్కృతంగా వున్న ఆనాటి జుట్టు, కండ్లు ఎన్నడు అతనికొరకు ప్రసన్నమౌతయి. "అది హాస్యంగా జేసిన ప్రద ర్శనం, దీనికింత బాధపడుతావేం?" అని ఆచేతుల్తో, ఆమణికంకణ త్రీలకు మెఱుగుపెట్టు ఆలేతచేతుల్తో వెనకాల్నుంచి కళ్లుమూసినా అతని జీవిత మంతా తరించిపోతుంది. సుదర్శనం ఎన్నోసార్లు భగ వంతుణ్ణిగూర్చి ప్రార్థించాడు ఆమెబాహువుల్లో తన మరణం కల్పించ మని.

సాత్వికమైన, కళంకరహితమైన సుదర్శనం ప్రేమావేశంలో కోమలకు భర్తవున్నాడనే స్మృతిగూడా లేదు. తానే భర్తనని తనలో తానుగ ర్వించుకునేవాడు. ఎన్నోసార్లు కోమల కుత్తరం వ్రాయాలని ఆలోచించాడు. ఏదో వ్రాశాడు. చింపివేశాడు. శ్యామల్ కు చూపి స్తుందేమో ఆవుత్తరం, నిజంగా ఆనాటిచూపుల్లో క్రూరత్వ మే వుంటే. ఏమైనా కానీయమని ఒకవుత్తరం వ్రాసి పంపాడు.

"నీకొఱకు జీవితమైనా చాలిస్తాను. నీవు లేకమాత్రం బతక లేను. అయితే నాసంగ తేం శ్యామల్ కు చెప్పకు. నాకలం ఇంతకన్నా యేం వ్రాయలేదు. నీవృష్టిలో ఇదిరప్పైతే నన్ను క్షమించి పూర్ణం గానే నన్ను మరచిపో."

ఈవుత్తరం ప్రమాదవశాత్తు శ్యామల్ చేతుల్లోకి వచ్చింది. కోమల స్నానంజేస్తూ మల్లెపందిరిఆకుల్లో పెట్టి మరచిపోయింది. ఆమె చింపివేశా ననుకుంది.

ఏంచేస్తాడు? ఇంత ఘోరం జరుగుతున్నదని తెలిసేటఱకు ఉన్మాద మెత్తింది శ్యామల్ కు.

తన భార్యను, కోమలను సుదర్శనం వలచాడా? ఇది యెప్పు డైనా సంభవమేనా? ఒకరు వలచి ప్రేమించిన వ్యక్తిని ఇంకొకడు తేరిచూస్తాడా? ఎంతపాపం! ఎంతసాహసం! తాను మాట్లాడే నీతికిదేనా అర్థం? తన సంస్కార మంతా పరస్త్రీచేలాకర్షణంతో ప్రారంభ మౌతుందా? ఎంతమిత్రుడైనా సరే, వాణ్ణి క్షమించరాదు. నా సంసారం భంగంచేసేవాణ్ణి క్షమించను. తను మిత్రుడని యింటికి చేరనిచ్చినందునల్ల ఇంత మూడింది.

ఇది కోమలతప్పు. దాని మెఱుపుల్లో వాడు తేసుల్కున్నాడు. లేకపోతే సుదర్శన మట్లాంటివాడు కాడు. స్త్రీలది చంచలమైన స్వభావం. ఈ అవిశ్వాస మంతా కోమలదగ్గరనుంచే ఆరంభమైంది. మాధురి నాతో మాట్లాడుతున్నదని ఉడికిందికావాలె. కోమల వరాం డాలో నిద్రపోతోంది. రాత్రి రెండు యామాలు దాటినై. శ్యామల్ కు నిద్రపట్టలేదు. కోమల సుదర్శనం జ్వరాన్నిగురించి పడే పశ్చాత్తాపం, పదిరోజుల్నుంచి తమయింటికి రావటంలేదని తనను వెళ్లి కనుక్కొమ్మని నిర్బంధించడం, ఇదంతా అతని అనుమానాన్ని బలపరిచినై. సుదర్శన మెట్లా జ్వరంతో కృశిస్తున్నాడో యిక్కడ కోమల ఉత్సాహంగూడా అట్లాగే తగ్గిపోతూండటం జ్ఞాపక మొచ్చి శ్యామల్ కంపించిపోయినాడు.

భర్త రెండురోజులనుంచి తనతో సరిగ్గా ప్రవర్తించటం లేదని, సుదర్శనాని కెంత అన్యాయం చేశానని కోమల నిర్వేదంతో గడుపు తున్నది. "ఇట్లారాశాడేం సుదర్శనం! ఆవుత్తరం నాకేం బోధపడ్లేదు. అతనికేదో నామీద వేరే అభిప్రాయం కలిగింది. అయ్యో! యిదేం అన్యాయం! అతని అభిప్రాయాన్ని మరల్చడ మెట్లా? నిష్కారణంగా చచ్చిపోతాడే! ఎట్లా యీఘోరం మాన్పడం? ఈమహావ్యథతో, చెప్పటానికి వీలులేని యీవికృతావస్థలో ఊరక శయ్యమీద దొర్లు తూంది కోమల. తన కర్తవ్య మేంటి? ఇప్పు డేమి చెయ్యాలె? శ్యామల్ కాకుండా రెండోవ్యక్తిని ఆమె హృదయం ఎట్లా ప్రేమిస్తుంది? తన ప్రియమైన శ్యామల్, తన్నెంతో గౌరవంగా చూస్తూకోరినవెల్లా తెచ్చి యిచ్చేశ్యామల్, తనఅమూల్యమైన యౌవనాన్నంతా కరిగించుకొని తాగుతున్న శ్యామల్ ను వదుల్తుందా? సుదర్శనం హత్యచేసుకోవడం చూస్తుందా? బతుకల్లా బ్రహ్మచారియై, చదువంతా వృథాపుచ్చి, తన మేడ, ఆస్తి, సంపత్తు అంతా త్యాగంజేసి సన్యాసియై, జేలయై కృశించి జీర్ణించిపోతాడు తాను నిరాకరిస్తే. శ్యామల్ కన్నా కోమలదికిక్లిష్టావస్థ.

ఏమైనాసరే, శ్యామల్ తనభార్య నిద్రపోతునట్టు ఆవిధంగానే లేవకుండా నొక్కిచంపెయ్యాలని దృఢసంకల్పం జేసుకున్నాడు. పక్కదిగి కోమలమంచందగ్గరకు తారాడుతాడు. కోమలముఖం జూసి ఆగిపోయినాడు. నిద్రపోతూన్న ఆమెముఖంలో, కళ్లల్లో ఎంతో విశ్వాసం రాజ్యంచేస్తున్నది. నిద్రపోతున్న ఆకనుబొమ్మలు తన కోసమే నిరీక్షిస్తున్నట్టు తోచింది. శ్యామల్ పెదిమలు తమ నంటు కోటంలేదని కావాలె ఆమె మెరుగైన చంపలు చనువుతోకదిలి నట్ట నిపించింది. నిశ్వాసభారంచేత బాగా నిద్ర పట్టలే దవ్వాళ. ఎడమ వైపు మళ్లింది. నిద్రలో స్పృహలేకపోయినా ఆమె చేయి తల్లో

పూలుపద్దుకుంది. శ్యామల్ పెద్దనిట్టూర్పు విడిచాడు. కళ్లవెంట బొటబొట నీళ్లురాలై. చేతు లాగ్లేదు. వెనక్కి పోయినాడు.

౨

సుదర్శనానికి జబ్బు జాస్తీఅయింది. జీవించడంకూడా దుర్లభము నేస్థితిలో వున్నాడు. ఒకసారి శ్యామల్‌ను చూడాలనిపించింది సుదర్శనానికి. ఆకబురువిని శ్యామల్ పరుగెత్తాడు. మరేం తొందర లేదు అని అతనికి ధైర్యంతోచింది. ఒకసారి కింకోసారి రావాలంటే శ్యామల్ హృదయం వప్పుకోటం లేదు. ఆయనమనస్సులో చాలా సంక్షోభం జరుగుతోంది. ఆరోజల్లా భోజనం లేదు. రోగుల్నికూడా చూట్టాని కెళ్ళలేదు. తనరూములోనే కూచోని ఉన్నాడు. కోమలకు కూడా భోజనం లేదు. భర్తను సమీపించడానికి ధైర్యం లేదు. కారణం తెలియరాకుండా వుంది. తన ముఖం చూశినప్పుడింకా క్రోధం, దుఃఖం ఆవరిస్తున్నట్లు కనుపించింది. రాత్రిజరిగిన ఈవికృతఘట్టం ఆమెకు తెలియనేతెలియదు. ఆమెమరణ మెంత చేరువలో ఉన్నదో ఆమె కేం తెలియదు.

మాధురి రెండుమూడుసార్లు వర్తమానంచేశింది శ్యామల్‌ను వచ్చి మాట్లాడి వెళ్ళవలసిందని. ఊళ్లో ద్రోహులు తన్ను హత్య జెయ్యాలనుకుంటున్న సంగతి మాధురికిగూడా తెలిసింది. ఈవిషయం శ్యామల్‌తో మాట్లాడుదా మనుకుంది. అతను రాకపోతే చివరకు తానే శ్యామల్‌యింటికి బయలుదేరింది. శ్యామల్ గదిలోనే కూచోనున్నాడు. మాధురి వచ్చింది.

"శ్యామల్ !" అన్నది.

శ్యా—వస్తున్నా.

ఎదురుగా వచ్చాడు శ్యామల్. ఇద్దరు రూములో కూచున్నారు.

మా—అట్లా వున్నావేం యివ్వాళ ?

క్రోధంతో పొంగిపోయిన ఆ యెర్రనికళ్లల్లోంచి బొటబొట కన్నీళ్లు రాలినై. తన ప్రకృతావస్థ వెల్లడికాకుండా గంభీరంగా "ఏమీ లే"దన్నాడు.

మా—నీకళ్లట్లా వున్నాయేం శ్యామల్ ? ఒక్కసారి యిట్లారా. నాదగ్గరకు రా. మాధురినిచూస్తే ఉత్సాహంతో వుండేవాడివి. నేనే మన్న నీలేతహృదయాన్ని నొప్పించానా ?

శ్యా—లేదు, ఎప్పుడు లేదు. నీవల్లనే నేనింకా ప్రపంచంలో జీవిస్తున్నాను.

అని మాధురిచేతులు తన వక్షస్థలంమీదికి చేర్చుకున్నాడు.

మా—యేశావా ఈవ్యూరిస్థితి? రహస్యంగా ఈ రాత్రికో, రేపో కొంతమంది నన్ను చంపెయ్యాలని తిరుగుతున్నారుట.

శ్యామల్ వికృతంగా నవ్వుతూ.

"వాండ్ల కేమొచ్చింది? నీవల్ల వాండ్ల కేంబాధ? ప్రపంచానికి సంఘబాహుళ్యమే కావాలెగాని న్యాయంతో పనిలేదు. వెధవ ఆచారంకోఅకు ఎంతమంది బలి కావాలిపొచ్చింది! శ్యామల్ జీవించి యుండగా అంతపని జరుగనిస్తాడా? ముందు శ్యామల్ వధింపబడందే మాధురికంఠం, ఆసుందరకేశభారంచేత వంపుదిరిగినకంఠం-మణిభూషణాది హారాలుగూడా భౌతికభోగాలని నిరాకరించి ప్రకృతిలతాపుష్ప మాలికల నలంకరించు నీకంఠం-స్పృశింపగల మూళ యెవ్వడు?" అంటూ ఆవేశంతో లేచాడు.

మాధురి తన ఆపద నంతా మరచిపోయింది. మహారణ్యరూపమైన ఆగ్రామంలో ఈమాత్రపు వివేక మున్నవాడు, మాధురంటే ప్రేమించేవాడు శ్యామ లొక్కడే. మాధురి శరీరం, బాహువులు, వక్షస్థలం ధైర్యంతో పొంగినై. శ్యామల్‌హృదయంలో జరిగే బీభత్సోన్మాదం, కొత్తదనం మలచుకొన్న మాధురి యౌవనవికాసంలో నక్కిపోయింది.

భర్త భోజనంలేకుండా వున్నాడని, అసలు విషయమే తెలియక కాగిపోతోంది కోమల. ఈదారుణమంతా ఎందుకు జరుగుతున్నది? పునీతురాలైన కోమల అకారణంగా యీవిషమావస్థలో ఎందుకు మగ్గిపోవాలె? అంత మహాపరాధం ఆమె యేంజేసింది? ప్రపంచానికున్న విశ్వాసమైన, అనుక్షణం తెలుసుకుంటూన్న, ప్రేమిస్తూన్న తలమీద పూవువలె ఎంచుకుంటూన్న భర్తకు లేకపోయింది ఈనాటికి. కాళ్లమీదనైనాబడి అతన్ని భోజనానికి బ్రతిమాల్దా మనుకుంది. కోమల గడిముందరికి వెళ్లింది. ఆమె యింకా లోపలికి పోనేలేదు. "వెళ్ళిపో, అవతలికి"అని శ్యామల్ గర్జించాడు ఘోరంగా. ఒక్కకేకవేసి కోమల క్రింద పడిపోయింది. మాధురి కేమీ అర్థంకా లేదు దాని తత్వం. వెంటనే పోయి ఆమెను లేవదీసి వరాండాలో మంచంమీద చేర్చింది.

చైతన్యమే నశించిన ట్లుందిఆమెకు. నెమ్మదిగా శైత్యోపచారాలు చేశింది. ఆమె తేరుకున్నది. మాధురి శ్యామల్‌వద్దకు వెళ్ళి "అట్లా చేయుటం చాలా పాపం. కోమల చాలా విధేయురాలు. ఆమె పవిత్రమైన వ్యక్తి. ఆమెదగ్గర నేర్చుకోవాలసిన విషయాలుకూడా చాలా వున్నాయి." అని మందలించింది. తన అవస్థను చెప్పుకొనుట కది సమయము గాలేదు. మాధురి వెళ్లిపోయింది.

తరువాత శ్యామల్ లోపలికి వెళ్లాడు. కోమల అతని పాదాలమీదబడి వెక్కివెక్కి ఏడ్వటం మొదలుపెట్టింది. నేనేమైన అవిధేయతగా ప్రవర్తించానా? క్షమించండి. మీకోమల మీకోసం అగ్నిలో కురుకమన్నా సిద్ధంగా వుంది" అని యేడ్చింది. శ్యామల్ కాలు విదిల్చివేశాడు. ఆమె అవతల పడ్డది. అక్కడినుంచి లేచిపోయినాడు శ్యామల్.

౮

తనభర్తలో హఠాత్తుగా యింత మార్పెందుకు కలిగింది? ఇదంతా, ఎవరు ప్రేరేపించారు? మాధురి ఇట్లా చేసిందా? లేదు. మాధురి చాలా మంచిది. కోమలంటే మాధురికి చాలాభక్తి. కోమలను రోజు కొక్కసారైన కలిసి మాట్లాడేది. కోమల దృఢసంకల్పం, వినిర్మలమైన ఆమె ప్రేమ, శాంతము, మాధురికి చాలా గౌరవ పాత్రంగా వుండేవి. కోమలకు మాధురిపైన ఏమీ అనుమానం లేదు. తన శీలమునుగురించి గొప్పనమ్మకం గలిగిన ఆమెకు ఉత్తరం విషయం స్మృతికే రావటంలేదు. శ్యామల్ కెవరన్నా ఆపత్తు తెచ్చిపెడుతూంటే ఇట్లా ఆవేశనపడుతున్నాడేమో ననుకుంది. అయితే తనేం జేసింది? కోమల కేమీ బోధపడటం లేదు.

సుదర్శనాన్ని యిట్లా ఆదరించినప్పటినుండి ఆమె కిన్ని అవస్థలు తటస్థించినై. నిజంలో, చనువుగా వచ్చేవాణ్ణి, చిన్నతనంనుంచి తన గౌరవాదరణలకు పాత్రమైనవాణ్ణి వేరుభావంతో చూచినదాని కేగతి యైన న్యాయమే అనుకుంటూంది. సుదర్శనాన్ని చూడక చాలారోజులైంది. అతనికి జబ్బు ఎక్కువగా వుందని తెలిసింది. అతన్ని చూశామనుకొని కోమల బండిచేసుకొని తిన్నగా సుదర్శనం మేడదగ్గరికొచ్చింది.

మాధురి సగౌరవంగా వచ్చి ఆమెను తీసుకోవెళ్లి సుదర్శనం దగ్గరికి చేర్చింది. అతని మంచందగ్గర ఒక కుర్చీ వేసుంది. సుదర్శనం ఆమెను దాంట్లో కూచోమని సంజ్ఞచేశాడు. సవిచారంగా కోమల దాంట్లో కూచుంది.

కో—సుదర్శనం! ఎట్లా వుంది నీవంట్లో?

సుదర్శనం ఏమీచెప్పలేక కళ్లనిండా నీళ్లుతెచ్చుకున్నాడు. అతని స్థితిచూచి కోమల దుఃఖం కంఠంలోనే దిగమ్రింగింది.

కో—నీవు యింతకాలంనుంచి మా యింటికి రానందుచేత యిల్లంతా విషాదచ్ఛాయ లలముకున్నయి. ఎన్నడు చనువుతో మందహాసంజేస్తు వాదిస్తూ గంటలకొద్ది గడుపుతావో!

సుదర్శనం గద్గదంతో "కోమలా! నన్ను క్షమించు. నేను నీపట్ల చాలా ద్రోహిని. నీమన స్సెంతో నొప్పించాను.

కోమల దీర్ఘమైన నిశ్వాసం విడిచింది. ఆనిశ్వాసంలో సుదర్శనం జీవితమంతా సన్నిహితమై కుంచుకొనిపోతున్న ట్లనిపించింది.

కో:—నేనందుకోసమే వచ్చాను. నా అనాదరణ మనస్సులోనుంచి తీసివెయ్యి నాసుదర్శనా! పవిత్రమైన నీహృదయంలో నన్ను శపించకు. మన హృదయాలు భిన్నభిన్నమై సమార్గాలు శాశ్వతంగా నిల్చిపోయినై. నన్ను పూర్తిగా మరచిపో. నే నీప్రపంచమున జన్మించనే లేదు. నీవు నన్ను చూడనే లేదు. నీయభిలాష తెలిసింది. నాకిపు డేమి కర్తవ్యం తోచటం లేదు. నీవు సన్యాసివై, నీసర్వవైభవాలు విడిచి, జీర్ణించి, నశించడం నేను చూడలేను. నీకొఱకు ఈదేహానికి యిక స్వస్తి జెప్పిస్తా. ఈశరీరం, ఒకపవిత్రమైన, నిష్కల్మషమైన ప్రేమపాశమును బలిగా పరిగ్రహింపదు. తానే ఆమహోన్వ్యక్తి వికృతావస్థలో ఆత్మార్పణం జేస్తుంది.

సుస్నిగ్ధమైన ఆమెచెక్కిళ్లు బాష్పప్లుతములైపోయినై.

సుదర్శనానికి ఇక జీవితంతో అవసరం తీరిపోయింది. గుండె రాయి అయిపోయింది.

సు—'కోమలా! ఇట్లారా. ఒక్కసారి నీచేయి నాహృదయం మీద పెట్టు. నాజీవితం చాలిస్తాను.' అన్నాడు అవ్యక్తంగాను, అస్పష్టంగాను.

కోమల తొట్రుపాటుతో,భయంతో సుదర్శనం హృదయంపైన చేయివేసింది. సుదర్శనం తనచేతుల్లో ఆమెచేయి అదుముకున్నాడు.

మాధురి మందు కలుపుకోరావాలని వెళ్లింది యింకా రాలేదు.

శ్యామల్ బజారునుంచి యింటికి వెళ్లాడు. ఇంట్లో కోమల లేదు. దాసీని ప్రశ్నించాడు. సుదర్శనంమేడకు బండిమీద వెళ్లారని చెప్పింది. ఇంట్లో అంతా వెతుక్కని తొట్రుపాటుతో ఒకకత్తిని గుప్తం చేసుకున్నాడు. కోమలతో కాపురంజేసిన ఆయింటిలో యిక పాదం పెట్టదలచుకోలేదు. ఆయింటితో, కోమలతో ఆనాడే ఋణం తీరిపోయింది. భోజనంలేదు. జుట్టంతా దుమ్ముకొట్టివుంది. కాలినడకతో తూల్తూ బయలుదేరినాడు. శ్యామల్ ను ఇంతమోసం చేయటం, ప్రాణమంతా తనదిగా జేసికొన్న నన్నా యీఘోరం. అంటూ సుదర్శనంయింటికి వచ్చాడు.

ఇల్లంతా శాంతంగావుంది. సుదర్శనం పడుకోనున్న గదిదగ్గరకు వెళ్లాడు. ఏముంది? అతని పిచ్చి మస్తిష్కమంతా ఆవరించింది. సుదర్శనం హృదయంమీద కోమలచెయ్యి. తనచేతుల్తో అదుముకొని కండ్లు మూసుకొని వున్నాడు సుదర్శనం. శ్యామల్ వికృతంగా కేకలువేసి బొబ్బరించాడు.

"దుర్మార్గులాలా! ఇంత విశ్వాసఘాతకురాల వని అనుకోలేదు. నీ ఆలోచనలు—యత్నాలు—" అంటూ కోమలమీదబడి కంఠమంతా నులిమేస్తున్నాడు. ఆ మహాసాధ్వి కంఠంలో ఏదో ప్రార్థనము నలిగిపోయింది. జేబులోంచి కత్తి తీశాడు. ప్రమాదం! ప్రమాదం! మెడలోని విద్యుద్దీపాలన్నీ ఒక్కసారి ఆరిపోయినై క్రరెంటునిల్చి. మేడంతా పెద్దఅల్లకల్లోలంగా వుంది. ప్రతిధ్వనించిపోతోంది. ఎవరో అడ్డంగా వచ్చారు. "ఇది మహాపాపం. ఎందు కింతవెర్రి?" అని కత్తి పట్టుకోబోయినారు. రెండునిమిషాల్లోమళ్లీ దీపాలన్నీ వెలిగినై.

ఏముంది? చేతుల్నిండా నెత్తురే. ఒళ్లంతా నెత్తురే. శ్యామల్ బాహువుల్లో మాధురిమెడ తెగి వ్రేలాడుతూంది. శ్యామల్ పెద్దకేక వేసి ఏడుస్తూకూలిపోయినాడు. కోమల మాధురికాళ్లమీదబడి జీవితం చాలించింది. ఈ విశ్వప్రళయమంతా సుదర్శనం మరణశయ్యమీద తేలకండ్లతో పరికిస్తున్నాడు.